

78 మీటర్ల జాతీయ పతాకంతో ర్యాలీ నిర్వహించిన అనంతరం అదాలత్ సర్కిల్‌లో మానవహారంగా ఏర్పడిన ఎన్‌సీసీ క్యాడెట్లు, విద్యార్థులు – నయీంనగర్

- ఊరూరా.. వాడవాడలా జాతీయ జెండాల రెపరెపలు
- జెండాలను ఆవిష్కరించి, పోలీసుల గౌరవ వందనం స్వీకరించిన ముఖ్యఅతిథులు
- స్వాతంత్య్ర సమరయోధులకు సన్మానం
- ఉత్తమ ఉద్యోగులకు ప్రశంసాపత్రాల అందజేత..
- జాతీయ సమైక్యతను చాటేలా విద్యార్థుల ప్రదర్శనలు



వరంగల్‌లో జెండా ఎగురవేసి వందనం చేస్తున్న మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, కలెక్టర్ సత్యశారద



ములుగులో గౌరవ వందనం స్వీకరిస్తున్న మంత్రి సీతక్క, కలెక్టర్ దివాకర, ఎస్పీ శబరీశ్

# మురిసిన మువ్వన్నెలు

## ఉమ్మడి జిల్లాలో సంబురంగా 78వ స్వాతంత్య్ర వేడుకలు



హనుమకొండలో నృత్యం చేస్తున్న మల్లికాంబ మనోవికాస కేంద్రం విద్యార్థినులు



ములుగులో జాతీయ జెండాతో నృత్య ప్రదర్శన ఇస్తున్న విద్యార్థినులు





హనుమకొండ పరేడ్ గ్రౌండ్‌లో మార్చ్‌ఫాస్ట్ చేస్తున్న పోలీసులు



హనుమకొండలోని పరేడ్ గ్రౌండ్‌లో జెండా ఆవిష్కరించి వందనం చేస్తున్న మంత్రి కొండా సురేఖ, కలెక్టర్ ప్రావీణ్య, సీపీ అంబర్‌కిషోర్‌ఝా, కమిషనర్ అశ్వినీ తానాజీ

మువ్వన్నెలు మురిశాయి. ఊరూరా.. వాడవాడలా త్రివర్ణ శోభితమై రెపరెపలాడాయి. 78వ స్వాతంత్య్ర దినోత్సవ వేడుకలు గురువారం ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా సంబురంగా జరిగాయి. హనుమకొండ జిల్లా పోలీస్ పరేడ్‌గ్రౌండ్‌లో జరిగిన వేడుకల్లో మంత్రి కొండా సురేఖ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. జాతీయ జెండాను ఆవిష్కరించారు. వరంగల్ జిల్లా స్వాతంత్య్ర వేడుకలు ఖిలావరంగల్ ఖుష్‌మహల్ మైదానంలో నిర్వహించగా, మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, ములుగు జిల్లా తంగేడు మైదానంలో మంత్రి సీతక్క, మహబూబాబాద్ జిల్లా ఎన్టీఆర్ స్టేడియంలో ప్రభుత్వ విప్, డోర్నకల్ ఎమ్మెల్యే జాటోత్ రాంచంద్రూనాయక్, జనగామ జిల్లా కేంద్రంలోని ధర్మకంచ మినీస్టేడియం పరేడ్ గ్రౌండ్స్‌లో ఆలేరు ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య, జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ క్రీడా మైదానంలో రాష్ట్ర అటవీ అభివృద్ధి శాఖ చైర్మన్ పొదెం వీరయ్య జాతీయ జెండాలను ఆవిష్కరించి పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. ఆయా జిల్లాల అభివృద్ధి నివేదికలను చదివి వినిపించడంతోపాటు స్వాతంత్య్ర సమరయోధులను సన్మానించారు. ఉత్తమ సేవలు అందించిన ప్రభుత్వ ఉద్యోగులకు ప్రశంసాపత్రాలను అందజేశారు. అలాగే ప్రభుత్వ శాఖలు ఏర్పాటు చేసిన స్టాళ్లను ముఖ్యఅతిథులు పరిశీలించారు. ఇక దేశభక్తిని, జాతీయ సమైక్యతను చాటేలా విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.

*- నమస్తే తెలంగాణ నెట్‌వర్క్, ఆగస్టు 15*



భూపాలపల్లిలో గౌరవ వందనం స్వీకరిస్తున్న పొదెం వీరయ్య, పక్కన కలెక్టర్ రాహుల్ శర్మ, ఎస్పీ కిరణ్ ఖరే, ఎమ్మెల్యే సత్యనారాయణరావు



జనగామలో జెండాకు వందనం చేస్తున్న ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య, ఎమ్మెల్యేలు పల్లా, కడియం, కలెక్టర్ రిజ్వాన్ బాషా



మహబూబాబాద్‌లో జెండా వందనం చేస్తున్న ప్రభుత్వ విప్ రామచంద్రూనాయక్, కలెక్టర్ అద్వైత్‌కుమార్, ఎస్పీ సుధీర్ రాంనాథ్



పుట్టిన రోజు సదర్భంగా కేసీఆర్‌ను కలిసిన ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి

# ఎమ్మెల్సీ పోచంపల్లికి కేసీఆర్ శుభాకాంక్షలు

వరంగల్, ఆగస్టు 15 : ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డికి బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. గురువారం పోచంపల్లి కేసీఆర్‌ను కలిశారు. ఈ సందర్భంగా సంపూర్ణ ఆయురారోగ్యాలతో ఉండాలని, మరెన్నో పుట్టిన రోజు వేడుకలు జరుపుకోవాలని కేసీఆర్ ఆకాంక్షించారు. అలాగే, బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను పోచంపల్లి మర్యాదపూర్వకంగా కలిసి పూల మొక్క అందజేశారు. పోచంపల్లికి కేటీఆర్ పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపారు.

# సగంలోనే జెండా ఆవిష్కరణ..

## ఉపాధ్యాయుల నిర్లక్ష్యంపై స్థానిక ప్రజల ఆగ్రహం

ములుగురూరల్, ఆగస్టు 15 : జాతీయ జెండాను సగంలో ఆవిష్కరించి, గీతాలాపన చేయడం ములుగు జిల్లా కేంద్రంలో చర్చనీయంగా మారింది. కలెక్టరేట్‌కు కూతవేటు దూరంలో ఉన్న ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో గురువారం ఓ ఉపాధ్యాయురాలు జాతీయ జెండాను పూర్తిగా పైకి లాగి ఎగరేయాల్సి ఉండగా, మధ్యలోనే ఆవిష్కరించడం.. గీతాలాపన చేయడంతో అటుగా వెళ్లిన ప్రజలు చూసి, ఉపాధ్యాయుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కాటన్ క్లాత్‌తో తయారు చేసిన జెండాను కాకుండా పాలిస్టర్ జెండాను వాడడంతోనే జెండా ఆవిష్కరణ సరిగా జరగలేదని, ఉన్నతాధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరారు.



ములుగులోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో సగంలోనే ఆవిష్కరించి ఉన్న జెండా





# జెండా ఎత్తారు కానీ..

బచ్చన్నపేట, ఆగస్టు 15 : బచ్చన్నపేట మండల కేంద్రం జనగామ రోడ్‌లోని వికాస్ ఐటీఐలో గురువారం జాతీయ జెండాను ఆవిష్కరించారు.. కానీ, కిందికి జారకుండా కట్టడంలో నిర్లక్ష్యం చేశారు. దీంతో జెండా మధ్యలోనే కిందకు జారింది. జాతీయ జెండా విషయంలో నిర్లక్ష్యం వహించిన సంబంధిత వ్యక్తులపై ప్రజలు అసహనం వ్యక్తం చేశారు.

బచ్చన్నపేటలో వికాస్ ఐటీఐలో కిందకు జారిన జాతీయ జెండా



పొలంలో జాతీయ జెండాను ఆవిష్కరించి వందనం చేస్తున్న మహిళా కూలీలు

# మట్టి మనుషుల ఆత్మీయ వందనం

## పంట పొలంలో జెండాను ఎగరేసి దేశభక్తిని చాటుకున్న మహిళా కూలీలు

బయ్యారం, ఆగస్టు 15 : మట్టి మనుషుల దేశభక్తికి మువ్వన్నెల జెండా మురిసిపోయింది. ప్రకృతి ఒడిలో పంట పొలాలు ముచ్చటపడేలా స్వచ్ఛమైన మనసుతో చేసిన ఆత్మీయ వందనానికి జాతీయ జెండా సగర్వంగా రెపరెపలాడింది. 'మాకూ దేశభక్తి ఉంది.. మేమూ జెండా పండుగలో పాల్గొంటాం' అంటూ మహిళా కూలీలు వారు పనిచేసే వరి పొలంలో జెండాను ఎగరేసి, జాతీయ గీతాన్ని ఆలపించి అందరినీ ఆశ్చర్యపరిచారు. మహబూబాబాద్ జిల్లా బయ్యారం మండల కేంద్రంలోని గంగాబజార్‌కు చెందిన మహిళా కూలీలు వెంకట్రాంపురం శివారులోని ఓ రైతు పొలంలో నాటు వేసేందుకు వెళ్లారు. అక్కడే స్వాతంత్య్ర వేడుకలు జరుపుకున్నారు. నారు కట్టలను కుప్పగా పోసి, జెండా కర్ర ఏర్పాటు చేసి జాతీయ జెండాను కట్టి, ఆవిష్కరించారు. జాతీయ గీతాన్ని ఆలపించారు. ఇది చూసిన పలువురు స్థానికులు దేశభక్తంటే.. ఇది కదా అంటూ వారిని మెచ్చుకున్నారు.



చేను వద్ద వదిలేసిన బెండను చూపిస్తున్న రైతు ఎల్లయ్య

# బెండ రైతుకు బెంగ

## తగ్గిన ధర.. చేను వదిలేసిన రైతు

కేసముద్రం, ఆగస్టు 15 : బెండ రైతులు దిగులు చెందుతున్నారు. మార్కెట్‌లో బెండకాయకు ధర లేకపోవడం.. పెట్టిన పెట్టుబడి కూడా వచ్చే పరిస్థితి కనిపించకపోవడంతో చేనునే వదిలేస్తున్నారు. మార్కెట్‌లో కేజీ బెండకాయకు కనీసం రూ.10 కూడా పలకడం లేదని వాపోతున్నారు. కేసముద్రం మండలం మహమూద్‌పట్నం గ్రామానికి చెందిన ఎశబోయిన సారయ్య ఎకరం భూమిలో బెండ పంటను సాగు చేశాడు. ఇప్పటి వరకు విత్తనం, పురుగు మందులు, కలుపు నివారణ వంటి వాటితో కలిపి సుమారు రూ. 30వేల వరకు పెట్టుబడి పెట్టాడు. తీరా పంట చేతికి వచ్చే సమయానికి ధర తగ్గడంతో ఇబ్బంది పడుతున్నారు. ప్రస్తుతం రోజుకు క్వింటా చొప్పున దిగుబడి వస్తున్నా మార్కెట్‌లో ధర లేకపోవడంతో తెంపిన కూలీ ఖర్చులు కూడా రావడం లేదని చేనును వదిలేశాడు.



లింగంపల్లిలో మద్య నిషేధం అమలు సమావేశంలో పాల్గొన్న ఎక్సైజ్ సీఐ ప్రభావతి

# లింగంపల్లిలో మద్య నిషేధం

## ప్రతిజ్ఞ చేసిన గ్రామస్తులు, హాజరైన ఎక్సైజ్ సీఐ ప్రభావతి

బచ్చన్నపేట, ఆగస్టు 15 : తమ గ్రామంలో ఇక నుంచి మద్యం అమ్మకాలు నిలిపివేస్తున్నామని జనగామ జిల్లా బచ్చన్నపేట మండలం లింగంపల్లి గ్రామస్తులు గురువారం రాత్రి ప్రకటించారు. గ్రామ మాజీ సర్పంచ్ మల్లేశం, మాజీ ప్రజాప్రతినిధులు, మహిళలు, యువకులంతా ఏకమై ఈ నిర్ణయం తీసుకున్నారు. కుటుంబాలు, యువతను చిత్తు చేస్తున్న మద్యాన్ని తమ గ్రామ దరి చేరనీయమని ప్రతిజ్ఞ చేశారు. ఎక్సైజ్ శాఖ, పోలీసులను పిలిపించుకొని తమ నిర్ణయాన్ని వెల్లడించారు. ఈ సందర్భంగా ఎక్సైజ్ సీఐ ప్రభావతి గ్రామ ప్రజలతో మద్య నిషేధంపై ప్రతిజ్ఞ చేయించారు. గ్రామంలో పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, పలు పార్టీల నేతలు, మహిళలు పెద్దఎత్తున పాల్గొన్నారు. అనంతరం గ్రామంలో మొక్కలు నాటారు.

# జెండావిష్కరణ ఏర్పాట్లలో ఘర్షణ

- కత్తితో ఇద్దరిపై దాడిచేసిన వ్యక్తి
- జనగామ జిల్లా వెల్దండలో ఘటన

నర్మెట, ఆగస్టు 15: జాతీయ జెండా ఆవిష్కరణ ఏర్పాట్లలో ఇద్దరు యువకుల మధ్య జరిగిన ఘర్షణపై పెద్ద మనుషుల సమక్షంలో విచారిస్తుండగా ఒకరు కత్తితో దాడి చేయడంతో ఇద్దరికి గాయాలయ్యాయి. ఈ ఘటన జనగామ జిల్లా నర్మెట మండలం వెల్దండలో గురువారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామంలో కొందరు యువకులు చందాలు వేసుకొని బుధవారం రాత్రి జాతీయ జెండావిష్కరణ ఏర్పాట్లు చేశారు. ఈ విషయంలో గోల్కొండ శ్రీనివాస్, కంతి స్వామికి బుధవారం రాత్రి గొడవ జరిగింది. గురువారం ఉదయం జాతీయ జెండా ఆవిష్కరణ అనంతరం పెద్ద మనుషులు రాత్రి ఎందుకు గొడవ జరిగిందని స్వామిని, శ్రీనివాస్‌ను పిలిచి విచారించారు. శ్రీనివాస్ పెద్ద మనుషులు చెప్పింది వినకుండా అక్కడ నుంచి తిట్టుకుంటూ వెళ్తుండగా స్వామి, అతడి తమ్ముడు రవి ఎందుకు తిడుతున్నావని ప్రశ్నించారు. దీంతో శ్రీనివాస్ తన వద్ద ఉన్న కత్తితో స్వామి, రవిపై దాడి చేశాడు. ఈ ఘటనలో స్వామికి తీవ్రగాయాలవడంతో హైదరాబాద్‌లోని నీలిమా ఆస్పత్రికి తరలించారు. కంతి రవి స్వల్ప గాయాలు కాగా, అతడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు విచారణ చేపట్టి కేసు నమోదు చేసినట్లు ఎస్సై నగేశ్ తెలిపారు.

# అసలు చూపి.. నకిలీ ఇచ్చి..

- నకిలీ బంగారంతో రాజస్థాన్ వ్యక్తుల నయా మోసం
- బయ్యారంలో గుర్తించి దేహశుద్ధి, పోలీసులకు అప్పగింత



నకిలీ బంగారం



మోసానికి పాల్పడుతున్న రాజస్థాన్ వ్యక్తులు

బయ్యారం, ఆగస్టు 15 : అసలు బంగారాన్ని చూపి.. నకిలీది అంటగట్టి ప్రజలను మోసం చేస్తున్న ఇద్దరిని స్థానికులు గుర్తించి పోలీసులకు అప్పగించారు. వివరాల్లోకి వెళితే.. కురవి మండలం రాజోలుకు చెందిన సూపర్ మార్కెట్ వ్యాపారి రాజు వద్ద రాజస్థాన్‌కు చెందిన ఇద్దరు వ్యక్తులు కొన్ని నెలల నుంచి కిరాణా సామగ్రి కొనుగోలు చేస్తున్నారు. ఈ క్రమంలో రాజుతో ఏర్పడిన పరిచయంతో రెండు నెలల క్రితం షాపు వద్దకు వెళ్లి తమ బంధువులకు ఆరోగ్యం బాగాలేదని, తమ వద్ద ఉన్న బంగారు చైన్ కుదువ పెట్టుకొని డబ్బులు ఇవ్వాలని ప్రాధేయపడ్డారు. తన దగ్గర డబ్బులు లేవని చెప్పినప్పటికీ వినకుండా పలు మార్లు బతిమిలాడారు. బంగారం చైన్‌ను చూపించి, అందులో కొంత భాగాన్ని కట్ చేసి ఇచ్చి పరీక్ష చేయించుకోవాలని సూచించారు. రాజు దానిని పరీక్షించగా అసలైన బంగారమని తేలడంతో, 6 తులాల చైన్ పెట్టుకొని రూ. 2 లక్షలు ఇచ్చాడు. మరుసటి రోజు నుంచి ఫోన్ స్విచ్ ఆఫ్ చేసి ఉండడంతో అనుమానం వచ్చి గొలుసును పరీక్షించగా, అది నకిలీ బంగారమని తేలింది. దీంతో రాజు సీసీ ఫుటేజ్ ఆధారంగా మోసం చేసిన వారి కోసం మిత్రులు, తెలిసిన వ్యక్తులతో ఆరా తీస్తున్నాడు. ఈ క్రమంలో మోసానికి పాల్పడిన వ్యక్తులు గురువారం బయ్యారంలో సంచరిస్తూ కనిపించగా, స్థానికులు గుర్తుపట్టి దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించారు. ఇద్దరి వద్ద అరకేజీ వరకు నకిలీ బంగారాన్ని గుర్తించారు. అనంతరం బయ్యారంలోని మిత్రుడి సమాచారంతో వ్యాపారి రాజు అక్కడికి చేరుకొని తనకు జరిగిన మోసాన్ని స్థానికులు, పోలీసులకు వివరించాడు.


